నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, బుధవారం 11 డిసెంబర్ 2024 | SIDDIPET

సిద్దిపేటకు తిరుపతి వెంకన్న

టీటీడీ నూతన చైర్మన్ బీఆర్ నాయుడును కలిసిన సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

- ఆలయం నిర్మించాలని టీటీడీ చైర్మన్‌కు హరీశ్‌రావు విజ్ఞప్తి
- వచ్చే పాలకమండలి సమావేశంలో ఆమోదించాలని వినతి
- సానుకూలంగా స్పందించిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

సిద్దిపేట, డిసెంబర్ 10: కలియుగ ప్రత్యక్ష దైవం.. తిరుమల తిరుపతి వేంకటేశుడు సిద్దిపేటలో కొలువుదీరనున్నాడని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మంగళవారం తిరుమల వెళ్లిన హరీశ్‌రావు నూతన చైర్మన్ బీఆర్ నాయుడును కలిశారు. సిద్దిపేట కోమటిచెరువు ప్రాంతంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేంకటేశ్వరాలయాన్ని నిర్మించాలని కోరారు. ఆలయ నిర్మాణం కోసం ఐదెకరాల 10గుంటల స్థలాన్ని మంజూరు చేశామన్నారు. గతంలోనే టీటీడీ ఇంజినీరింగ్ అధికారులు, స్థపతి పర్యటించి స్థలాన్ని పరిశీలించి, దానికి అనుగుణంగా ఆలయ నిర్మాణ నమూనా, డిజైన్స్ రూపొందించారని చైర్మన్‌కు వివరించారు. వేంకటేశ్వర స్వామిని ప్రజలు ఇష్ట దైవంగా.. ఇలవేల్పుగా కొలుస్తారని, అలాంటి ఆలయం సిద్దిపేటలో నిర్మించడం గొప్ప అదృష్టమని పేర్కొన్నారు. వచ్చే బోర్డు మీటింగ్‌లో సిద్దిపేటలో వేంకటేశ్వర ఆలయ నిర్మాణానికి ఆమోదం తెలిపి, ఆలయ నిర్మాణ పనుల శంకుస్థాపనకు ముఖ్య అతిథిగా రావాల్సిందిగా కోరారు. అందుకు చైర్మన్ బీఆర్ నాయుడు సానుకూలంగా స్పందించి చీఫ్ ఇంజినీర్ అధికారి, సంబంధిత అధికారులను పిలిచి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

ఇలాంటి దుర్మార్గ పాలనను చూడలేదు

సంగారెడ్డిలో తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నినాదాలు చేస్తున్న నాయకులు

- ప్రభుత్వ విధానాలపై ప్రజా తిరుగుబాటు ఖాయం
- బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 10: ఇలాంటి దుర్మార్గ పాలన ఎక్కడా చూడలేదని బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ తల్లి వద్దురా... తెలంగాణ తల్లి ముద్దురా అంటూ నినదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగణ తల్లి విగ్రహాన్ని మార్చవచ్చు కానీ, ప్రజల గుండెల్లో మెదిలిన తెలంగాణ తల్లి రూపాన్ని చెరపలేరన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతున్నదని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ తల్లిని ఆవిష్కరించారని, తెలంగాణ తల్లిని కాదని ఎద్దేవా చేశారు. ఎన్నికలు వస్తే తెలంగాణ తల్లిని మూసే విధంగా రూపం ఉన్నదన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే రాజీవ్‌గాంధీ, ఇప్పుడు ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని సకల మర్యాదలతో గాంధీ భవన్‌కు పంపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మామిళ్ల రాజేందర్, కాసాల బుచ్చిరెడ్డి, పట్నం మాణిక్యం, జైపాల్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, మందుల వరలక్ష్మి, మాజీ జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, డాక్టర్ శ్రీహరి, వెంకటేశ్వర్లు, నాగరాజ్ గౌడ్, మధుసూదన్‌రెడ్డి, మల్కాపూర్, శ్రీధర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కృష్ణగౌడ్, చక్రపాణి, శ్రవణ్‌రెడ్డి, విఠల్, రమేశ్, రామప్ప, శ్రీధర్‌రెడ్డి, కిశోర్ విష్ణు, అశ్విన్, రాజేందర్ పాల్గొన్నారు.

జై కేసీఆర్.. జై తెలంగాణ

జహీరాబాద్‌లో కేసీఆర్ సినిమాను తిలకించిన బీఆర్ఎస్ శ్రేణులు


జహీరాబాద్‌లోని సినీమ్యాక్స్ థియేటర్‌లో సినిమాను వీక్షిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

జహీరాబాద్, డిసెంబర్ 10: బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వీరాభిమాని, హీరో రాకింగ్ రాకేశ్ తీసిన కేసీఆర్(కేశవ చంద్ర రమావత్) సినిమాను జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తిలకించారు. జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆధ్వర్యంలో పట్టణంలోని సినీమ్యాక్స్ థియేటర్‌లో మంగళవారం మార్నింగ్ షో నిర్వహించారు. నియోజకవర్గంలోని న్యాల్‌కల్, కోహీర్, జహీరాబాద్, ఝరాసంగం, మొగుడంపల్లి మండలాలకు చెందిన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో వచ్చి కేసీఆర్ సినిమాను తిలకించి జై కేసీఆర్.. జై తెలంగాణ అంటూ నినదించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై రాకింగ్ రాకేశ్ తీసిన సినిమా చరిత్రలో నిలిచిపోతుందని బీఆర్ఎస్ నేతలు తట్టు నారాయణ, నామ రవికిరణ్ అన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దిపేటలో బతుకమ్మతో బీఆర్ఎస్ మహిళా నాయకులు

తెలంగాణ తల్లిని అవమానించిన దుర్మార్గుడు రేవంత్

కాంగ్రెసోళ్లు ప్రతిష్ఠించింది తెలంగాణ తల్లి విగ్రహం కాదు.. కాంగ్రెస్ తల్లి విగ్రహం

- బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే మేళ తాళాలు, డప్పుచప్పులతో గాంధీభవన్ తరలిస్తాం
- 20 ఏండ్ల కింద తెలంగాణ తల్లి విగ్రహానికి రూపకల్పన చేసిన కేసీఆర్
- ప్రజల బాగోగులు పట్టని బ్యాగుబాజ్జి రేవంత్ రెడ్డి
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ
- బతుకమ్మను తీసేసిన నిన్ను చరిత్ర క్షమించదు
- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్
- బతుకమ్మ ఆటపాటలతో హోరెత్తిన సిద్దిపేట అంబేద్కర్ సర్కిల్
- పెద్దఎత్తున తరలివచ్చిన మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు
- సిద్దిపేటలోని పాత బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన

సిద్దిపేటలో అంబేద్కర్ సర్కిల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

సిద్దిపేట, డిసెంబర్ 10: తెలంగాణ తల్లిని అవమానించిన దుర్మార్గుడు సీఎం రేవంత్ రెడ్డి అని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహం మార్పు, బతుకమ్మను తొలిగించడంపై బీఆర్ఎస్ ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం సిద్దిపేట పట్టణం అంబేద్కర్ చౌరస్తాలోని మోడల్ బస్టాండ్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినదించారు. అనంతరం ఎమ్మెల్సీ దేశపతి మాట్లాడుతూ.. తెలంగాణ రైతుల కష్టం, వ్యవసాయానికి, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మను తెలంగాణ తల్లి విగ్రహంలో ఏర్పాటు చేశామని తెలిపారు. 20 ఏండ్ల కిందటే కేసీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి రూపకల్పన చేశారని, ఆ విషయం కాంగ్రెస్ దుర్మార్గులకు తెలియదని ఎద్దేవా చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబుకు తొత్తుగా మారి తెలంగాణ రాకుండా అడ్డుపడింది రేవంత్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి సీఎంగా కేసీఆర్ అయినా నేపథ్యంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బ్యాగు బాజ్జీగా రేవంత్ రెడ్డి అవతారమెత్తిన సంగతి ప్రజలందరికీ తెలుసన్నారు. ప్రజల బాగోగులు చూడమంటే బ్యాగోగులు చూస్తున్న దుర్మార్గుడు రేవంత్ రెడ్డి అని ధ్వజమెత్తారు. సీఎం సచివాలయంలో ఏర్పాటు చేసింది తెలంగాణ తల్లి విగ్రహం కాదని, అది కాంగ్రెస్ తల్లి విగ్రహం అని తెలిపారు. చేతిలో జొన్నకర్ర పెట్టగానే తెలంగాణ తల్లి విగ్రహం కాదని గుర్తుంచుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేటీఆర్ నిలదీస్తుంటే అక్రమ కేసులు బనాయిస్తూ కాలం వెల్లదీస్తున్నాడని మండిపడ్డారు. బీఆర్ఎస్ వచ్చాక తెలంగాణ రాష్ట్రానికి పరిమితం కాకుండా ప్రపంచంలోని అమెరికా లాంటి దేశాల్లో కూడా బతుకమ్మను ఆడుతున్నారని అందుకు గర్వంగా ఉందని చెప్పారు.

బతుకమ్మ ఆడిన మహిళలు

తెలంగాణ తల్లి చేతిలో ఉన్న బతుకమ్మను తొలిగించడంపై మహిళా లోకం ఆగ్రహం వ్యక్తం చేసింది. మాజీ జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు, మాజీ ఎంపీపీ శ్రీదేవి, కౌన్సిలర్లు, మహిళా నాయకుల ఆధ్వర్యంలో బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు.. బతుకమ్మ చీరలు బంద్ చేశావ్, ఇప్పుడు తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మను తీసేశావ్ అంటూ మండిపడ్డారు. బతుకమ్మ ఆటపాటలతో నిరసన వ్యక్తం చేశారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

సిద్దిపేట పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, నాయకులు పాల సాయిరాం తదితరులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు మాజీ జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణ శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు, జాప శ్రీకాంత్‌రెడ్డి, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గోవిందా.. గోవిందా పాట

రైతుబంధు గోవిందా, పంట రుణమాఫీ గోవిందా, బతుకమ్మ చీరలు గోవిందా, మహాలక్ష్మి గోవిందా, కల్యాణలక్ష్మి గోవిందా, తులం బంగారం గోవిందా అంటూ పాటలు పాడి నిరసన తెలిపారు. తెలంగాణ తల్లి ముమ్మాటికీ మన అందరికీ దేవత అని చెప్పారు. బతుకమ్మతోపాటు తెలంగాణ మహిళలను అవమానించేలా, వారి మనోభావాలను దెబ్బతీశావని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసిన కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని మేళతాళాలు, డప్పుచప్పుళ్లతో గాంధీభవన్‌కు తరలిస్తామని తెలిపారు. ఇప్పటికే తెలంగాణ ద్రోహిగా మిగిలిన రేవంత్‌రెడ్డి సంస్కృతి, సంప్రదాయానికి మంగళం పాడారని, బతుకమ్మను తీసేసిన నిన్ను చరిత్ర క్షమించదని విమర్శించారు. తెలంగాణ తల్లి మాది.. కాంగ్రెస్ తల్లి మీదా అ నినదీస్తూ హోరెత్తించారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం పుట్టిన పోరాటంలో నుంచి పుట్టిన తల్లి తెలంగాణ తల్లి అని పేర్కొన్నారు. కుట్రలు.. కుతంత్రాల నుంచి పుట్టిన తల్లి కాంగ్రెస్ తల్లి అన్నారు.



సిద్దిపేట అంబేద్కర్ సర్కిల్ మోడల్ బస్టాండ్ వద్ద తెలంగాణ తల్లి మార్పునకు నిరసనగా రోడ్డుపై బైఠాయించిన మహిళలు, బీఆర్ఎస్ శ్రేణులు

కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధిచెబుతారు

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి


సంగారెడ్డి జిల్లా దౌల్తాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, డిసెంబర్ 10: తెలంగాణ తల్లి విగ్రహ రూపం మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న తెలంగాణ ఉద్యమానికి ప్రతీకగా నిలిచేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠించిన తెలంగాణ తల్లి విగ్రహ రూపం మార్చి కాంగ్రెస్ తల్లిగా ప్రతిష్ఠించడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వాలు మారినంతమాత్రాన విగ్రహ రూపాలు మార్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తెలంగాణకు ప్రతిబింబంగా నిలిచే బతుకమ్మను తొలిగించి మహిళల పట్ల కాంగ్రెస్‌కు ఉన్న చిత్తశుద్ధి ఏంటో నిరూపించుకున్నారన్నారు. సంక్షేమ పథకాలు అమలుచేయడంలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ లేబర్‌వెల్ఫేర్ బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ ఎంపీపీ నర్సింహులుతో పాటు నాయకులు దామోదర్‌రెడ్డి, అర్జున్, రవి, వీరేశం గౌడ్, శివశంకర్ రావు, కృష్ణాగౌడ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీహెచ్‌లో అంతర్జాతీయ సదస్సు

సదస్సులో పాల్గొన్న పలు దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, విద్యావేత్తలు, విద్యార్థులు

కంది, డిసెంబర్ 10: ఐఐటీ హైదరాబాద్‌లో ఆరోగ్యం, వ్యాధుల్లో సిర్కాడియన్ రిథమ్స్‌పై మంగళవారం అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో 11 దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అధ్యక్షుడు, సెంటర్ ఫర్ సెల్యూలర్ మాలిక్యూలర్ బయాలజీ మాజీ డైరెక్టర్ మోహన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వినూత్న పరిశోధనలు, ఆలోచనలు రేకెత్తించే అంశాలపై శాస్త్రవేత్తలు చర్చించారు. ఆలోచనల మార్పిడి, క్రోనో బయాలజీ రంగాన్ని అభివృద్ధి చేసే విధంగా ప్రసంగాలు చేశారు. ఆరోగ్యంపై సిర్కాడియన్ రిథమ్స్‌ల ప్రభావం, శారీరక, జీవక్రియ, భావోద్వేగ, ప్రవర్తన ప్రక్రియలను నియంత్రించే దశలను వివరించారు. అనంతరం ఇండియన్ సొసైటీ ఫర్ క్రోనోబయాలజీ అధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందజేశారు. జర్మనీ, ఐర్లాండ్, జపాన్, సింగపూర్, యూఏఈ, యూకే, ఇజ్రాయిల్, యూఎస్ఏ, ఆస్ట్రేలియా, డెన్మార్క్‌కు చెందిన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో సందీపన్, నీరజ్ కుమార్, చంద్రశేఖర్, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

చేయి గుర్తుకోసమే విగ్రహం మార్పు

- ప్రభుత్వాలు మారినప్పుడల్లా తల్లులు మారాలా..?
- ప్రభుత్వాలు మారితే ప్రజల తలరాతలు మారాలి..
- బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి
- రజాకార్ల తరహాలో కాంగ్రెస్ పాలన
- ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్‌లో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి,శేరి సుభాష్‌రెడ్డి

మెదక్, డిసెంబర్ 10(నమస్తే తెలంగాణ): ప్రభుత్వం అభివృద్ధిలో పోటీ పడాలి తప్ప, విగ్రహాలు మార్చడంలో కాదని, 14 ఏండ్ల తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన బతుకమ్మను తీసేసి కేవలం చేయిగుర్తు కోసమే తెలంగాణ అస్తిత్వమైన బతుకమ్మ, కిరీటం తీసేసి విగ్రహాన్ని మార్చారని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు మెదక్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు బట్టి జగపతి, ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, బీఆర్ఎస్ శ్రేణులు కలిసి తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మీడియా సమావేశంలో పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన బతుకమ్మ ఆనవాళ్లు లేకుండా చేశారని ఆరోపించారు. తెలంగాణ తల్లి దైవ స్వరూపిణిగా, శక్తి స్వరూపిణిగా తీర్చిదిద్ది చర్చల తర్వాత.. కేసీఆర్ హయాంలో ఆమోదం పొందిందన్నారు. దేశంలో ఆలిని మార్చిన వారిని చూశాం కానీ, తల్లిని మార్చిన వారిని చూడలేదన్నారు. దానికి తెరలేపింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం తెలంగాణ తల్లి కోసం తీసుకొచ్చిన జీవోను అంగీకరించడానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశా కార్యకర్తలు, సమగ్ర శిక్షా ఉద్యోగులు రోడ్డెక్కారని, రైతులను నిండా ముంచుతూ ఇప్పటి వరకు రైతు బంధు, పింఛన్లు, పంట రుణమాఫీ ఇవ్వలేదన్నారు. విగ్రహాలు మార్చడంలో ఉన్న శ్రద్ధ ఇచ్చిన హామీలపై పెట్టి ప్రజలకు మేలు చేయాలన్నారు.

కాంగ్రెస్ అరాచకాలను ఎండగడుతాం: ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

రజాకార్ల సమయంలో కూడా ఇలాంటి పరిస్థితి లేదని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశాల్లో కేసీఆర్ పాల్గొని కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలను ఎండగడుతారని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. తెలంగాణ తల్లి అంటే కేవలం ఒక పార్టీకి.. ఒక వ్యక్తికి.. సంస్థకు సంబంధించింది కాదు.. మొత్తం జాతిని జాగృతపర్చిన తల్లి తెలంగాణ తల్లి.. ఈ ప్రభుత్వం అసలు బతుకమ్మనే కనపడొద్దు అన్నట్లుగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ కోకన్వీనర్లు లింగారెడ్డి, కృష్ణాగౌడ్, జుబేర్ అహ్మద్, కౌన్సిలర్లు భీమరి కిశోర్, ఆర్కే శ్రీనివాస్, మెదక్ మండల పార్టీ అధ్యక్షుడు అంజాగౌడ్, నాయకులు ప్రభురెడ్డి, మాయ మల్లేశం, కిష్టయ్య, ఆంజనేయులు, రాజు, సంగ శ్రీకాంత్, సాంబశివ రావు, ఎలక్షన్ రెడ్డి, ప్రభాకర్, సాప సాయిలు, యాదగిరి, శ్రీనివాస్, శ్రీధర్ రెడ్డి, మహమ్మద్, మోహన్ రాథోడ్, గట్టేశ్, రుక్మాచారి, రంజిత్, కిరణ్, దశరథం, అమీర్, చాంద్‌పాషా పాల్గొన్నారు.

మెదక్‌లో సమ్మెకు మద్దతు తెలుపుతున్న శేరి సుభాష్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి

సమగ్ర శిక్షా ఉద్యోగులకు సంఘీభావం

మెదక్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): సమ్మె బాట పట్టిన సమగ్ర శిక్షా ఉద్యోగులకు మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు సంఘీభావం తెలిపారు. మంగళవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని, హన్మకొండలో దీక్ష చేస్తున్న ఉద్యోగస్తుల వద్దకు పీసీసీ హోదాలో వెళ్లి మాటిచ్చి, సీఎం అయ్యాక వారిని రేవంత్‌రెడ్డి రోడ్డున నిలబెట్టారని ఆరోపించారు. శాసనసభ సమావేశాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే విధంగా కేటీఆర్, హరీశ్‌రావుల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బట్టి జగపతి, మల్లికార్జున్ గౌడ్, కృష్టారెడ్డి, శ్రీనివాస్, కిశోర్, అంజాగౌడ్, లింగారెడ్డి, కృష్ణగౌడ్, జుబెర్ అహ్మద్, ప్రభురెడ్డి, కిష్టయ్య, ఎలక్షన్‌రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్, గౌస్, గట్టేశ్, రుక్మాచారి, దశరథం, కిరణ్, రంజిత్, చందు పాషా తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌కు ఉద్యమ చరిత్ర తెలుసా?

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, డిసెంబర్ 10: తెలంగాణ రాష్ట్రసాధన కోసం కేసీఆర్ 14ఏండ్లు పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించారని, కనీసం ఉద్యమంలో పాల్గొనని ఉద్యమ చరిత్ర, విలువలు తెలియని రేవంత్‌రెడ్డి ఆలోచనావిధానాలు చూస్తుంటే తెలంగాణ అస్తిత్వంపై దాడి చేసేలా ఉన్నాయని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. తెలంగాణ తల్లి రూపాన్ని కాంగ్రెస్ తల్లిగా మార్చినందుకు నిరసనగా మంగళవారం గజ్వేల్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ఆలోచనా విధానాలన్నీ ఉద్యమకాలానికి భిన్నంగా ఉన్నాయని, ఏనాడూ ఉద్యమంలో పాల్గొనని రేవంత్‌రెడ్డికి తెలంగాణ తల్లి రూపం విలువ తెలియదన్నారు. ఆనాడు తెలంగాణ తల్లి రూపాన్ని విద్యావంతులు, మేధావులతో కలిసి చర్చించిన తర్వాత కేసీఆర్ అందరి సమక్షంలో ప్రకటించారన్నారు. తెలంగాణలో దసరా పండుగకు ప్రత్యేకత ఉందని, అలాంటి పండుగను గుర్తుచేసేలా తెలంగాణ తల్లి చేతిలో మొక్కజొన్న కంకులు, బతుకమ్మలతో కూడిన రూపం ఉందన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసేలా సాగుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. నేడు తెలంగాణ సమాజం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న విధానాలపై చర్చిస్తున్నారని, ఏ ఒక్క వర్గం కూడా తెలంగాణ తల్లి కొత్త రూపాన్ని స్వాగతించడం లేదన్నారు. దమ్ముంటే ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలపై దృష్టి సారించి అన్ని హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ జెజాల వెంకటేశం గౌడ్, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, మాజీ ఎంపీపీ అమరావతి, మండల పార్టీ అధ్యక్షులు బెండే మధు, నవాజ్‌మీరా, శ్రీనివాస్ గౌడ్, కుమార్, కౌన్సిలర్లు రజిత, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, మల్లేశం, నాయకులు కృష్ణారెడ్డి, మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, బొల్లారం ఎల్లయ్య, జాఫర్ ఖాన్, విరాసత్ అలీ, దేవేందర్, రమేశ్ గౌడ్, స్వామిచారి, అహ్మద్, ఉమర్ పాల్గొన్నారు.